క్లుప్తంగా

63 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు



మాట్లాడుతున్న ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా కో-ఆర్డినేటర్ ప్రతాపరెడ్డి

ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 63 మందికి ఉద్యోగాలు లభించినట్లు ప్రిన్సిపాల్ జిష్ణు నాగవిజయ్, జిల్లా కో ఆర్డినేటర్ ప్రతాపరెడ్డి తెలిపారు. 5 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 63 మందిని ఎంపిక చేసుకున్నాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక దృఢత్వం



విద్యార్థులతో యోగా చేయిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: యోగాతో మానసిక దృఢత్వం సాధ్యమని ఐసీడీఎస్ సూపర్ వైజర్ నాగేశ్వరమ్మ అన్నారు. ముసలిమడుగు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులతో యోగా చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉదయం కొంత సేపైనా యోగా చేయాలని, చిరుధాన్యాలు తదితర పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు.

మహానందీశుడి పల్లకీ ఉత్సవం



పల్లకీసేవ నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: స్థానిక కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు శుక్రవారం పల్లకీసేవను ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, అర్చకులు శరభయ్య శర్మ వైభవంగా నిర్వహించారు. అలంకార మండపంలో ప్రత్యేక పూజల అనంతరం నంది బసవన్నలను పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకీ ముందు నడిపిస్తూ ఆలయ ప్రాకారాల్లో ఉత్సవాన్ని కనులపండువగా చేపట్టారు. ఆలయ పర్యవేక్షకులు అంబటి శశిధర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సూరె హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై దృష్టి సారించండి

మిడుతూరు: సమస్యాత్మక గ్రామాలపై దృష్టి సారించాలని నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రమణ్యం సిబ్బందికి సూచించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో రాత్రి వేళల్లో గస్తీ పెంచాలని, మిస్సింగ్, పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవాలని, రికార్డులను పకడ్బందీగా నిర్వహించుకోవాలని, స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎస్ఐ ఓబులేసు, ఏఎస్ఐ సుబ్బయ్య ఉన్నారు.

రైల్వేగేటు మూసివేత

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

మహానంది: ముందస్తు సమాచారం లేకుండా గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామం వద్ద రైల్వేగేటును మూసేయడంతో భక్తులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విజయవాడ, గుంటూరు, గిద్దలూరు మీదుగా గాజులపల్లె నుంచి గాజులపల్లె రైల్వేస్టేషన్ మార్గంలో నిత్యం వేలాది మంది భక్తులు, స్థానికులు మహానందికి వస్తుంటారు. రైల్వేగేటు మరమ్మతుల పేరుతో ఎలాంటి ప్రకటన లేకుండా శుక్రవారం మూసేయడంతో ప్రయాణికులు తిరిగి నంద్యాల మార్గంలో నందిపల్లె, పెద్దకొట్టాల, పట్టణంలో నుంచి మహానందికి చేరుకున్నారు.

ఒకే చోట రెండు రోడ్డు ప్రమాదాలు

నందికొట్కూరు: మండల పరిధిలోని నందికొట్కూరు–నాగలూటి రహదారిపై ఒకే ప్రాంతంలో రెండు సంఘటనలు శుక్రవారం చోటు చేసుకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. పగిడ్యాల మండలం నెహ్రూనగర్‌కు వెంకటేశ్వరరాజు మిడుతూరు మండలంలోని నాగలూటి సచివాలయం ఉద్యోగి విధులకు వెళ్తున్న సమయంలో నందికొట్కూరు పట్టణం సమీపంలో కారు–బైక్ ఎదురెదురుగా ఢీకొన్నారు. ప్రమాదంలో సచివాలయ ఉద్యోగికి తీవ్ర గాయాలు కావడంతో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అదే ప్రాంతంలో బొలెరో, కూలీల ఆటో ఢీకొనడంతో పలువురు కూలీలకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో కూలీలకు వైద్య చికిత్సలు చేయించారు. నాగటూరు గ్రామానికి చెందిన కూలీలు మిడుతూరు మండలంలోని పైపాలెం గ్రామానికి కూలీ పనికి కోసం ఆటోలో వెళ్తుండగా ప్రమాదం జరిగింది. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు

- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు
- ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయికి ఎంపిక చేసిన నిర్వాహకులు



అతిథులకు వందనం చేస్తున్న క్రీడాకారులు



కబడ్డీ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

పాములపాడు: స్థానిక ఏఎస్ఆర్ జెడ్పీ హై స్కూల్‌లో శుక్రవారం ప్రారంభించిన ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా ఎంపిక పోటీలు హోరా హోరీగా సాగాయి. ముందుగా సర్పంచు మేకల భాగ్యమ్మ, వేంపెంట మాజీ సర్పంచు రామసుబ్బమ్మతో కలిసి జాతీయజెండాను ఆవిష్కరించారు. క్రీడాకారులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. అనంతరం క్రీడా పోటీలను ప్రారంభించారు. పోటీల నిర్వహణకు, బహుమతులకు సింగపూర్ తెలుగు సమాజం కార్యదర్శి డాక్టర్ టేకూరి నాగేశ్వరరావు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ సుభాషిణి, హెచ్‌ఎం గోపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు రాజశేఖర్, నాగరాజు, సుమలత, శ్రీనివాసులు, సాయిక్రిష్ణ, కళ్యాణి, శాప్ కోచ్ శాంతరాజ్ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉద్యోగావకాశాలు

మహానంది: క్రీడల్లో రాణించే విద్యార్థులకు ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉంటాయిన ఎంఈఓ రామసుబ్బయ్య తెలిపారు. తిమ్మాపురం జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు నిర్వహించారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిచి, ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

కొత్తపల్లి: క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంపీడీఓ మేరి, ఎస్ఐ ఎం.కేశవ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలను వారు ప్రారంభించి మాట్లాడారు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచి జాతీయ స్థాయికు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ మండల కో ఆర్డినేటర్ బి.మురళి నాయక్, సర్పంచు లక్ష్మీదేవి, వ్యాయామ ఉపాధ్యాయులు చంద్రశేఖర్, సుంకన్న, స్వప్నశ్రీ, రినాబేగం పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ, ఎస్ఐ

క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈఓ -2 శ్రీనాథ్

మిడుతూరు: ప్రతి క్రీడాకారుడు మైదానంలో క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలని ఎంఈఓ శ్రీనాథ్ సూచించారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన స్కూల్ గేమ్స్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడా పోటీల్లో పాల్గొనడం వల్ల విద్యార్థులకు శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సాయితిమ్మయ్య, ఎస్‌జీఎఫ్ మండల కార్యదర్శి, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్‌గేమ్స్‌లో శ్రీశైలం విద్యార్థుల ప్రతిభ

శ్రీశైలంప్రాజెక్ట్: మండలస్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక సున్నిపెంటలో జరిగాయి. అందులో శ్రీశైలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నారు. 8వ తరగతి విద్యార్థులు బి.శేఖర్, డి.ఈశ్వర్, పి.అశోక్, ఎస్.లక్ష్మీనరసింహ, డి.మహమ్మద్‌వలి, జెడ్.బాలు నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం కె.వెంకటరమణ, వ్యాయామ ఉపాధ్యాయుడు బి.చంద్ర తెలిపారు.



విద్యార్థులతో ఉపాధ్యాయులు

క్రీడలతో ఆత్మస్థైర్యం మెండు

జూపాడుబంగ్లా: క్రీడల్లో రాణించటం వల్ల ఆత్మస్థైర్యం పెరుగుతుందని అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తి తెలిపారు. శుక్రవారం గురుకుల పాఠశాలలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు నిర్వహించారు. 250 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. అండర్–14 లో 75 మంది, అండర్–17లో 75 మంది క్రీడాకారులు నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు క్రీడల మండల కోఆర్డినేటర్ శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు శివన్న, విజయభాస్కర్‌రెడ్డి, రవి, జయమ్మ, స్వరూప, పద్మావతమ్మ, దీప్తి పాల్గొన్నారు.



కబడ్డీలో తలపడుతున్న విద్యార్థినులు

ప్రతి రైతును ఆదుకోవాలి

నందికొట్కూరు: భారీ వర్షాలకు నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్‌ప్రసాద్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. భారీ వర్షాలకు రాయలసీమ ప్రాంతంలో వేల ఎకరాల్లో పంట దిబ్బతిందని, వీలైనంత త్వరగా రైతుల బ్యాంక్ ఖాతాలకు పరిహారం జమ చేసి ఆదుకోవాలని ఆయన సీఎస్‌ను కోరారు.



సీఎస్‌కు రైతుల సమస్యను విన్నవిస్తున్న లబ్బి వెంకటస్వామి

కాలనీలు పరిశుభ్రంగా ఉండాలి



జేసీబీతో చెత్తా చెదారం తొలగింపు చర్యలు చేపట్టిన ఎంపీడీఓ గోపీక్రిష్ణ

పాములపాడు: మండలంలోని ప్రతి కాలనీ పరిశుభ్రంగా ఉండాలని ఎంపీడీఓ గోపీక్రిష్ణ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా రహదారుల పరిశుభ్రతా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధులతోపాటు ప్రధాన రహదారుల్లో జేసీబీతో చెత్తా చెదారం తొలగించారు. ప్రతి గ్రామంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్య పనులు తప్పకుండా పాటించాల్సిందేనన్నారు. అనంతరం తన కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచు మేకల భాగ్యమ్మ, ఈఓపీఆర్డీ గంగాధర్, పంచాయతీ కార్యదర్శి తిప్పన్న పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

- ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు: గ్రామీణ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే జయసూర్య సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్యదర్శులకు, పారిశుధ్య కార్మికులకు డస్ట్ బిన్లను పంపిణీ చేశారు. ప్రతి కుటుంబానికి రెండు డస్ట్ బిన్ల చొప్పున అందజేసి, తడి పొడి చెత్తలను సేకరించాలని పారిశుధ్య సిబ్బందికి ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శోభరాణి తదితరులు పాల్గొన్నారు.



కార్మికులకు డస్ట్ బిన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

భ్రామరికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం 7 గంటలకు ప్రారంభమైన సేవలో భాగంగా లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు ముందుగా సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలను నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. అలాగే శ్రీశైలగ్రామ దేవత అంకాళమ్మ అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు.

ఆదర్శ ఉద్యోగులకు అభినందన

ఆత్మకూరు: స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజీ ఆవరణలో శుక్రవారం ఆదర్శ ఉద్యోగులను డీఎం మహేంద్రుడు ఆధ్వర్యంలో అభినందించారు. ఆగస్టు నెలలో అత్యధిక ఆదాయం తెచ్చిన కండక్టర్లు జి.వి.స్వామి, జి.ఆర్.ఎల్.రెడ్డి, డి.బి.నాయక్, కె.నాగన్న, పి.సరస్వతి, కె.ఎస్.వలి, కె.గోవిందయ్య, ఎస్.మూర్తుజాబి, జి.ఆర్.స్వామి, ఎన్.ఎన్.భూషణ్‌లతోపాటు అత్యధిక కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లు పి.దర్గయ్య, ఎం.కంరుద్దీన్, జి.వి.రమణ, ఎస్.కె.వలి, ఎం.స్వాములు, బి.ఎన్.అహ్మద్‌లకు ప్రశంసా పత్రాలను అందించి అభినందించారు.

మున్సిపల్ కమిషనర్‌కు..

ఇటీవల బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబును శుక్రవారం పండ్ల తోటల రైతు సంఘం నాయకులు మోమిన్‌మునీర్‌బాషా, కృషి పండ్ల తోటల అధ్యక్షుడు బైరాపురం మహబూబ్‌బాషా, నాయకులు దుబ్బ లింగమూర్తి, ఎన్.ఎస్.అసదుల్లా, ముసలముడుగు నబిసా, టైగర్ బాబు, మోమిన్‌జబ్బర్ సాబ్, మారుస, మూర్తుజా, ముసలముదు రషీద్, రసూల్ తదితరులు కలిసి పూలబొకే అందజేసి అభినందనలు తెలిపారు.



ఆదర్శ ఉద్యోగులకు మెగా చెక్కును అందజేసి అభినందిస్తున్న డీఎం మహేంద్రుడు

నాన్న మాటలే సివిల్స్ వైపు నడిపించాయి

- ఐపీఎస్ మనీషారెడ్డి

మహానంది: ×గ్రామీణ ప్రాంతంలో పుట్టిపెరగడంతో ప్రజలు పడుతున్న కష్టాలను కళ్లారా చూశాను. సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన నేనునా చుట్టూ నిత్యం ఎన్నో సమస్యలు చూస్తున్నా ఏమీ చేయలేకపోతున్నానని ఎంతో బాధేసేది. అప్పుడే నువ్వు పెద్ద ఆఫీసర్‌వి అయితే నీవంతు పేదలకు ఏదైనా చేయొచ్చు అని చెప్పిన మా నాన్న మాటలే నన్ను సివిల్స్ వైపు వెళ్లేలా చేశాయి¥ అంటూ మహానంది మండలం నందిపల్లెకు చెందిన ఐపీఎస్ మనీషారెడ్డి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో 76వ బ్యాచ్ ఐపీఎస్‌లకు దీక్షాంత్ పరేడ్‌లో పాసింగ్ అవుట్ కార్యక్రమం నిర్వహించారు. ఐపీఎస్ మనీషారెడ్డి తల్లిదండ్రులు వంగల సర్వేశ్వరరెడ్డి(రాజురెడ్డి), మల్లేశ్వరి, బాబాయ్, తదితర బంధువులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మనీషారెడ్డి మాట్లాడుతూ కష్టపడి పని చేస్తానని, పేదలకు తన వంతు అండగా నిలవడంతో పాటు సమస్యలను పరిష్కరించి వారి మన్ననలు పొందుతానన్నారు. సామాన్యుల సమస్యలను పరిష్కరించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటానన్నారు.



తల్లిదండ్రులతో ఐపీఎస్ వంగల మనీషారెడ్డి

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

నందికొట్కూరు: పట్టణ ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే తమ లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ బేబి అన్నారు. శుక్రవారం పట్టణంలోని పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీధిల్లో చెత్తాచెదారం పేరుకుపోతే వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని స్థానికులకు సూచించారు. మురుగు కాలువల నుంచి దుర్వాసన వచ్చినా మున్సిపల్ కార్యాలయంలో అధికారులకు తెలియజేయాలన్నారు.

వృద్ధాశ్రమం ప్రారంభం

నందికొట్కూరు: స్థానిక 15వ వార్డులో ఆర్ట్ ఆఫ్ లివింగ్ జిల్లా కో ఆర్డినేటర్లు శ్రీనివాసకుమార్, లింగన్నగౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వృద్ధాశ్రమాన్ని కౌన్సిలరు కృష్ణవేణి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనాథ వృద్ధుల కోసం ఆశ్రమం ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు.

విద్యార్థుల ప్రతిభ

నందికొట్కూరు: టాటా బిల్డింగ్ ఇండియా వ్యాసరచన పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారని నవనంది హైస్కూల్ చైర్మన్ శ్రీధర్ తెలిపారు. ప్రతిభ చూపి పథకాలు సాధించిన విద్యార్థులు ఎస్.సన, టి.వైష్ణవి, జీ.సుప్రీతను, షేక్. సన, ఎస్. తుబాఫర్హానా, నదియా తబస్సుంలను శుక్రవారం పాఠశాలలో అభినందించారు.

నిధులు విడుదల చేయాలి

మహానంది: పాఠశాలల నిర్వహణ నిధులు విడుదల చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు రామపక్కిరెడ్డి కోరారు. శుక్రవారం పలు పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులతో యూనియన్ సభ్యత్వ నమోదు చేయించారు. బోధనేతర పనులు, అనవసరమైన యాప్‌ల నుంచి ఉపాధ్యాయులకు విముక్తి కలిగించాలని, కేజీబీవీలకు సమయ వేళలు కల్పిస్తూ, వార్డెన్ పోస్టులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు దేవనాల శ్రీనివాసులు, మండల నాయకులు తులసీశ్వర్ రెడ్డి, శ్రీమాలి రెడ్డి, మద్దిలేటి, రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారుల నియామకం

మహానంది: కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా గ్రామాల్లో నిర్వహించే కార్యక్రమాలకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. నేటి నుంచి 26వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

వేతనాలు విడుదల చేయాలి

పాములపాడు: ఆప్కాస్ కార్మికుల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేష బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఏపీ మోడల్ స్కూల్, హాస్టల్ ఆప్కాస్ కార్మికులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సెప్టెంబర్ మొదటి వారంలో అందాల్సిన వేతనాలు ఇంతవరకు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడతున్నట్లు తెలిపారు.

అధైర్యపడకండి..అండగా ఉంటా



తమ్మడపల్లెలో మాట్లాడుతున్న శిల్పా చక్రపాణిరెడ్డి

మహానంది: ఏ కష్టమొచ్చినా అండగా ఉంటానని, ఎలాంటి పరిస్థితుల్లో అధైర్యపడ వద్దని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పార్టీ నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. తమ్మడపల్లె గ్రామానికి చెందిన పార్టీ మండల అధ్యక్షుడు కొమ్మా మహేశ్వరరెడ్డి తండ్రి బాలిరెడ్డి మృతి చెందడంతో శుక్రవారం శిల్పా చక్రపాణిరెడ్డి గ్రామానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బుక్కాపురం గ్రామ నేత యర్రగుంట్ల వెంకటేశ్వర్లు అలియాస్ పెద్దబుజ్జిని, అనారోగ్యంతో బాధపడుతున్న అల్లినగరం గ్రామ సర్పంచ్ మద్దుల లక్ష్మీదేవి భర్త బాలవెంకటరెడ్డిని పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ సభ్యుడు కేవీఆర్ మహేశ్వరరెడ్డి, నాయకులు కందుల వెంకటసుబ్బారెడ్డి, శరభారెడ్డి, వీరారెడ్డి, రఘురామిరెడ్డి, కుంచపు శ్రీనివాసులు, ఉప సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, మహానంది దేవస్థానం మాజీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ శివయ్య,అశోక్‌రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

- **బండిఆత్మకూరు:** మండల పరిధిలోని ఏ.కోడూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మబ్బు దేవదాసు అనారోగ్య సమస్యలతో శుక్రవారం మృతి చెందాడు.విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి దేవదాస్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



లోకేష్‌కు చెక్ అందిస్తున్న శిల్పా చక్రపాణిరెడ్డి

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు ఆర్థిక సాయం

- **శ్రీశైలంప్రాజెక్ట్:** జనసేన మూకల దాడిలో గాయపడిన శ్రీశైలానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త నడిపినేని లోకేష్‌చౌదరికి పార్టీ ఆర్థిక సాయం అందించి ఆదుకుంది. దాడి విషయాన్ని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు పార్టీ తరఫున రూ.50 వేల చెక్కును శుక్రవారం నంద్యాలలో శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి బాధితుడికి అందజేశారు.

పర్యావరణాన్ని కాపాడదాం

- మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మారుఫ్ ఆసియా

ఆత్మకూరు: ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మారుఫ్ ఆసియా సూచించారు. శుక్రవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, ఎన్విరాన్‌మెంట్ ఏఈ ఓబులేష్, పట్టణ ప్రణాళిక అధికారి రామకృష్ణ, మున్సిపల్ ఆర్ఐ బ్రహ్మం, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ జీవన్‌కుమార్, మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం ఏఈ సాహిద్‌బాషా పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

పగిడ్యాల: పర్యావరణాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగరాజు అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో చెత్తాచెదారం తొలగించాలని పారిశుధ్య సిబ్బందికి సూచించారు. పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని గుర్తించాలన్నారు.



మొక్కకు నీరు పోస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మారుఫ్ ఆసియా

కొత్తపల్లి: స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని పెద్దగుమ్మడాపురం, గువ్వలకుంట్ల గ్రామాల సచివాలయాల వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచు నక్క విజయ్‌కుమార్, వీఆర్వో చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి వినోద్, వీఆర్వో నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఓజోన్ పొరపై విద్యార్థులకు అవగాహన

నందికొట్కూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఓజోన్ పొరపై ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.సునీత శుక్రవారం అవగాహన కల్పించారు. వాతావరణ కాలుష్యంతో ఓజోన్ పొర క్షీణిస్తుందన్నారు. కాలుష్యం తగ్గించేందుకు ఎలక్ట్రికల్ వాహనాలను వాడాలని సూచించారు.

రాహుల్ గాంధీ హత్యకు బీజేపీ నేతల కుట్ర

శ్రీశైలం ప్రాజెక్ట్: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ హత్యకు బీజేపీ నాయకులు కుట్ర పన్నుతున్నారని కాంగ్రెస్ నేత ఏఎస్ ఇస్మాయిల్ శుక్రవారం సున్నిపెంట టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నీ అమ్మమ్మ ఇందిరా గాంధీకి పట్టిన గతి నీకు పడుతుందని బీజేపీ నాయకుడు తర్విందర్‌సింగ్ మార్వా అనడం, రాహుల్‌గాంధీ నాలుక కోసి వస్తే రూ.10 లక్షలు బహుమతిగా ఇస్తానని బీజేపీ కూటమి భాగస్వామి ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ బహిరంగంగా ప్రకటన చేయడం చూస్తే రాహుల్‌గాంధీ హత్యకు కుట్ర, ప్రోత్సాహం జరుగుతుందని ఇస్మాయిల్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆసక్తికర అంశాలు తెలుసుకున్నాం

మహానంది: విజయవాడలో ఏర్పాటు చేసిన రెండు రోజుల బూట్ క్యాంప్‌లో పలు ఆసక్తికరమైన అంశాలు తెలుసుకున్నామని తిమ్మాపురం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మణరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల పాఠశాలల విద్యార్థులలో ఇన్నోవేషన్, డిజైన్ థింకింగ్ సంస్కృతిని ప్రోత్సహించడానికి భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో విజయవాడలో ఏర్పాటు చేసిన రెండు రోజుల బూట్ క్యాంప్‌నకు తమ కళాశాల విద్యార్థి కమలాకర్‌తో కలిసి పాల్గొన్నట్లు తెలిపారు. నూతన ఆవిష్కరణలకు సంబంధించి పలువురు దేశవ్యాప్త నిపుణులు శిక్షణ అందించారన్నారు.

